క్లుప్తంగా

నేడు నృసింహుడి హుండీల ఆదాయం లెక్కింపు

మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఈఓ రామకోటిరెడ్డి తెలిపారు. దేవస్థానానికి సంబంధించి ఎగువ, దిగువ సన్నిధులతో పాటు పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను ఉదయం 9 గంటలకు ఆలయ దిగువ సన్నిధిలో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

పెద్దకోనేరు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు (కల్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. మంగళవారం పెద్ద కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల నాణ్యతలో రాజీపడకుండా వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసి స్వామివారి తెప్పోత్సవం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిమరుపుపై పరిశోధనకు గుర్తింపు



డాక్టర్ చాంద్‌బాషా

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనలు చేస్తున్న డాక్టర్ షేక్ చాంద్‌బాషాకు అరుదైన గుర్తింపు లభించిందని విశ్వవిద్యాలయ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోగా ఉన్న డాక్టర్ చాంద్ బాషా మతిమరుపుపై పరిశోధన చేసి ఈ వ్యాధిలో నూతన శాస్త్రీయ కోణాన్ని గుర్తించారని పేర్కొన్నారు. 'న్యూరోనల్ డిస్ ఫంక్షన్‌లో మైక్రోగ్లియాతో సంయోగం చేయడంలో టెర్మ్-2 పాత్రను అన్‌టాంగ్లింగ్ చేయడం' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వివరించారు. ఆయన పరిశోధనను గుర్తించి డాక్టర్ షేక్ చాంద్ బాషాని జేఏడీ జర్నల్‌కు అసోసియేటెడ్ ఎడిటర్‌గా ఆహ్వానించినట్టు వెల్లడించారు. కేఎల్ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య జానకి రామయ్య, ప్రో చాన్సలర్ జగన్నాథరావు మార్గదర్శకత్వంలో డాక్టర్ చాంద్ ఈ పరిశోధనని చేసినట్లు తెలిపారు.

ఏపీఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి: నగర పరిధిలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక బెటాలియన్ ఆవరణలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తాటి కృష్ణారావు నాయుడు, ఉపాధ్యక్షులుగా పి.పావనరావు, కార్యదర్శిగా వీకే గోవర్ధనరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎంఎస్‌కే శ్రీధర్, సహాయ కార్యదర్శిగా ఎన్.తుకారామ్, కోశాధికారిగా ఎస్ఎస్ శంకరరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రంగారెడ్డి, ఎ.భాస్కర్‌రెడ్డి, గోవిందయ్య, సీహెచ్ సాంబశివరావును ఎన్నుకున్నారు.

మార్కెట్ యార్డు క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి: మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం నగరంలోని ఆటోనగర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ సీతారామయ్య, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవితో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: పాడి రైతులు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పేషంట్ రిజిస్టర్, అటెండెన్స్, సెమన్‌స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962 నంబర్‌కు ఫోన్ చేసినట్లయితే పశువైద్యుడు, సిబ్బంది వచ్చి పశువులకు చికిత్స అందజేస్తారని చెప్పారు. పాడి రైతులకు త్వరలో పశుకిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ)ను అందజేస్తామన్నారు. దీనిద్వారా రైతులకు పశువులను కొనుగోలు చేసుకొనేందుకు రుణ సదుపాయం లభిస్తుందని చెప్పారు. చేయూత పథకం ద్వారా ఎందరు రైతులు గొర్రెలు, మేకలు, పశువుల కోసం నమోదు చేసుకున్నారని పశువైద్యాధికారి కోటిరత్నంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, మేడికొండూరు పశువైద్యాధికారి మౌనిక ఉన్నారు.

మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్‌దే

- పెన్షన్ల నగదు పెంపుతో వృద్ధులు, వికలాంగులకు భరోసా
- నూతన పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని ఇందిరానగర్ సచివాలయం, ఆత్మకూరు సచివాలయాల పరిధిలో మంజూరైన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించారు. ఆత్మకూరు సచివాలయం వద్దగల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సీఎం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచడం హర్షణీయమన్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 1007 నూతన పెన్షన్లు మంజూరు కాగా, మంగళగిరి రూరల్ పరిధిలో 449 పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకటో తేదీ తెల్లవారుజామున 5 గంటలకే పెన్షన్ ఇంటికి పంపిణీ చేస్తున్నారన్నారు. నగరం పరిధిలో ప్రతి నెలా రూ.3.65 కోట్లు పింఛన్‌ల కోసం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గతంలో టీడీపీ పాలనలో రూ.50గా ఉన్న పెన్షన్‌ను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.200లకు పెంచగా, తండ్రి ఆశయ బాటలో సీఎం జగన్ వృద్ధులు, దివ్యాంగులకు జీవితం మీద భరోసా కల్పించేందుకు రూ.3 వేలు పెంచుకుంటూ వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యు.శారదాదేవి, ఎంపీడీఓ రామప్రసన్న, ఆత్మకూరు మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా పెన్షన్లు తొలగించలేదు

తాడేపల్లిరూరల్: ఉండవల్లి రెండవ సచివాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలోని 64 లక్షల మంది లబ్ధిదారులకు 1వ తేదీ ఉదయం 5 గంటలకల్లా వలంటీర్లు ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా పెన్షన్లు తొలగించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామప్రసన్న, ఉండవల్లి పంచాయతీ సెక్రటరీ రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లతో ఇంటి ముంగిటకే వైద్యం

మంగళగిరి: నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లతో పేద ప్రజలకు ఇంటి ముంగిటకే నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో రూ.1.30 కోట్లతో చేపట్టి పూర్తికావొస్తున్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ చినకాకాని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను మరోవారం రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నగర పరిధిలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించడం జరిగిందని, ఇప్పటికే ఏడు ప్రారంభించామని తెలిపారు. మరో రెండింటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌ను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు మరిన్ని విభాగాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా వైద్యులను వారంలో మూడు రోజులు కేటాయించి సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ రమేష్, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూ హక్కులు కల్పించాలి

ఎమ్మెల్యే ఆర్కేకు బాధితుల వినతి

మంగళగిరి: యర్రబాలెంలోని సర్వే నంబరు 774లో నివశిస్తున్న పేదలకు భూ హక్కులు కల్పించాలని బాధిత కుటుంబాలకు చెందిన పలువురు మంగళవారం నగరంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)ని కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, ఈ నేపథ్యంలో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యర్రబాలెంలోని సర్వే నంబరు 774ను అసైన్డ్ భూములుగా ప్రకటించి రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవానికి 1954 సంవత్సరానికి ముందు అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయాలని హైకోర్టు కూడా తీర్పునిచ్చిందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే తహసీల్దార్‌తో విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, నల్లచెరువు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రేమిణిశెట్టి గోపితో పాటు పలువురు అసైన్డ్ భూముల బాధితులు ఎమ్మెల్యే ఆర్కేను కలసి వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): గ్రామాలు, పట్టణాల్లో భూ సమస్యలను పరిష్కరించి, వివాదాలు లేకుండా చేయడానికి భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామంలో వైఎస్సార్ జగనన్న భూహక్కు భూరక్ష పథకంపై రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో నిర్వహించిన సర్వే రికార్డులే ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆ రికార్డులను సవరించి ఎటువంటి సమస్యలు లేకుండా అధునాతన యంత్రాలతో రీసర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో ఈ సర్వేను మన ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. గతంలో భూ సర్వే చేయించుకోవాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు అధికారులే మీ పంట పొలాలకు వచ్చి సర్వే నిర్వహించి, హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. రైతులందరూ రీసర్వేను సద్వినియోగం చేసుకుని అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో పెనుమూలి గ్రామ సర్పంచ్ కొరితూల పద్మావతి, ఎంపీటీసీ సల్మా, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు, వీఆర్వో సీతయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, సచివాలయ సర్వేయర్ రాజేశ్వరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

- 24 గంటల పాటు హైడ్రామా
- కన్నకూతురు చావును బేరం పెట్టిన తల్లి
- చివరకు అనారోగ్యంతో మృతి చెందిందంటూ ఫిర్యాదు



పావని మృతదేహం

తాడేపల్లిరూరల్: ఓ వివాహిత ఇంటి వరండాలో గేటుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిని అడ్డంగా పెట్టుకుని కన్నతల్లి తన పేగు బంధాన్ని మరచిపోయి కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులతో హైడ్రామా ఆడి చివరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నా కూతురు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది అంటూ మంగళవారం ఫిర్యాదు చేసింది. సేకరించిన వివరాల ప్రకారం..

నున్న మండలం బోడపాడు గ్రామానికి చెందిన జయ తన కుమార్తె పావని (26)ని తాడేపల్లి రూరల్ పరిధిలోని అమరావతి కరకట్ట వెంబడి కృష్ణుడి గుడివద్ద నివాసముండే పుచ్చకాయల మహేష్‌కు ఇచ్చి 20 ఫిబ్రవరి 2014న వివాహం చేసింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. పిల్లలు పుట్టిన అనంతరం భార్యాభర్తల్దిరూ అనారోగ్యం పాలయ్యారు. పలుమార్లు ఆరోగ్య సమస్యల దృష్ట్యా భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి నున్న పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీలు సైతం జరిగాయి. ఏం జరిగిందో తెలియదు కానీ సోమవారం పావని తాను ఉంటున్న నివాసంలోని పెంట్ హౌస్‌లో ఇంటి చుట్టూ ఉన్న ఐరన్ గ్రిల్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. మహేష్ ద్వారా విషయం తెలుసుకున్న పావని తల్లి జయ మొదట బంధువుల సహాయంతో ఇక్కడకు చేరుకుని నా కూతురు చావుకు కారణం అల్లుడు మహేష్, తల్లి విజయలక్ష్మి, వారి కుమార్తెలే అంటూ నానాయాగి చేసింది. అక్కడి నుంచి పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరడంతో పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి జయ, జయతో పాటు వచ్చిన పెయిడ్ ఆర్టిస్టులు మహేష్, వారి తల్లిపై గొడవకు దిగుతున్నారే తప్ప తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఇదే సమయంలో రాజీ కుదుర్చుకున్నామని జయతో వచ్చిన పెయిడ్ ఆర్టిస్టులు అనడంతో ఎట్టకేలకు పోలీస్‌స్టేషన్ బయట మంగళవారం సాయంత్రం రూ.10 లక్షల జయ ఇచ్చేటట్లు సెటిల్‌మెంట్ చేసుకున్నారు. కొంతమంది పెద్దమనుషులు మనవడు, మనవరాలికి ఆ డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయమని కోరగా, వారితో నాకు ఎటువంటి సంబంధం లేదు. మహేషే చూసుకుంటాడంటూ తేల్చిచెప్పింది. అనంతరం పోలీసులు ఫిర్యాదు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో నా కుమార్తె అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుందని, మాకు ఎవరిపై అనుమానం లేదంటూ ఫిర్యాదు చేసింది. చివరకు వారు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



నూతన పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఫిరంగిపురం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. వేమవరంలో మంగళవారం సాయంత్రం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును ఏటా పెంచుతున్నారన్నారు. అందులో భాగంగానే ఈ నెల రూ.2,750 అందిస్తున్నట్లు తెలిపారు. అక్క,చెల్లెమ్మలు, అవ్వాతాతల కోసం ముఖ్యమంత్రి జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గతంలో టీడీపీ పాలనలో 39 లక్షలు పింఛన్లు ఇస్తే నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 68 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శివకుమారి, ఎం.సుధాకరరెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డీఈవో శైలజ పాఠశాలల తనిఖీ



రావెల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో పి.శైలజ

రావెల(తాడికొండ): మండలంలోని రావెల, పొన్నెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఫణిదరం, దామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా విద్యా శాఖాధికారి పి.శైలజ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణిదరం పాఠశాలలో విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ పరిశీలించి లోపాలను ఉండటంతో ఉపాధ్యాయులు బి.లక్ష్మీఇందిర, పి.రమాదేవి నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పర్యవేక్షణ లోపం గుర్తించిన కారణంగా ఎంఈవో టి.ఇందిరకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు అందరూ తప్పనిసరిగా యూనిఫాంతో పాటు షూ, బెల్టు ధరించి పాఠశాలలకు వచ్చేలా చూడాలని హెచ్ఎంలను ఆదేశించారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలిఘటిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు



ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సీఐడీ ఎస్పీ సరిత



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజ్, టీచర్లు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల అభివృద్ధి కార్యాలయంలో సావిత్రీబాయి పూలే 192వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే అని, ఆమె ఆడపిల్లల చదువు కోసం ఎంతో పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, సూపరింటెండెంట్ దేవరపల్లి వీరయ్య, దానబోయిన వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరం రజనీకాంత్, ఎస్‌కే జాని, అసన్, అహ్మద్, వెంకటేశ్వరరావు, అత్తోటి ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోరారు. భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే 191వ జయంతి సందర్భంగా నగరంలోని ఆటో నగర్‌లో గల కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే ఆర్కే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. సంఘం నాయకులు పారేపల్లి మహేష్, వాకా మాధవరావు, ఆలా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్స్ ఆధ్వర్యంలో..

నగరంలోని పార్కురోడ్డులో గల ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ హాజరై సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలిఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేశమాల సరళకు సావిత్రీబాయి పూలే -2023 అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు గరికముక్కు డేవిడ్, జేవీ రాఘవులు, గంజి వెంకయ్య, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

బీసీ సేన ఆధ్వర్యంలో..

నగరంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో బీసీ సేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు. సంఘం నాయకులు గోలి నాగకుమార్, సాధు వేణుగోపాల్, కుంచాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: నగర పరిధిలోని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యాలయంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సీఐడీ ఎస్పీ కేజీబీ సరిత పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ సంఘం నాయకులు అంగిరేకుల ఆదిశేషు, సీహెచ్ శ్రీదేవి, రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌కే సుభాని, డెవలప్‌మెంట్ ట్రీస్ ఎండీ డి.స్వర్ణలత, జేఏసీ నాయకులు కొల్లి జగన్మోహనరావు, ఆర్.నాగేశ్వరి, కె.ధనలక్ష్మి, కోదాడ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అని ఎంఈవో సాల్మన్‌రాజ్ అన్నారు. గొల్లపాలెం ఎంపీయూపీఎస్ పాఠశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాల్మన్‌రాజ్ సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జోసఫ్‌సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ప్రతి హామీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం రూ.2,750 చొప్పున పెంచి ఇస్తున్న పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న వారికి పెన్షన్ వచ్చేది కాదని, పెన్షన్ తీసుకోవాలంటే 7-10 రోజులు లైనులో నిల్చొని వృద్ధులు, వికలాంగులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. కానీ నేడు ఆ విధానానికి చెక్ పెడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును ఇంటింటికీ వెళ్లి అందించే పరిస్థితి కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిగా చేయాలనే ఆశయంతో జగనన్న ప్రతి డ్వాక్రా మహిళకు రూ.2 లక్షల చొప్పున రుణం అందజేస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం పెన్షన్ లబ్ధిదారులు, పార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ అభిమానులతో కలిసి ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పెన్షన్‌లు అందజేశారు. సర్పంచ్ తోకల సరోజిని, ఫిరంగిపురం ఎంపీపీ సహేలా నర్గీస్, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ముఖ్య నాయకులు తాళ్ల నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కొమ్మినేని రామచంద్రరావు, అవుతు శ్రీనివాసరెడ్డి, దామినేని రాము, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు తోకల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నులకపేటలో కుక్క విషయమై ఘర్షణ

తాడేపల్లిరూరల్: నులకపేటలో కుక్క పెంపకం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని మంగళవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ సాధిక్ అనే వ్యక్తి కుక్కను పెంచుతున్నాడు. అయితే ఇంటి పక్కన ఉండే నయీం బాజీ రహీం, వారి బంధువులు కుక్కను పెంచడానికి వీలులేదంటూ గొడవకు దిగి దాడికి పాల్పడ్డట్టు సాధిక్ ఫిర్యాదు చేశారు. అలీఖాన్ భార్య రేష్మ ఇంటిముందు కుక్క బహిర్భూమికి వెళుతోందని అడిగినందుకు బట్టలు చించినట్లు ఫిర్యాదు ఇవ్వడంతో మున్నీ భర్త సయ్యద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.